Digital, tmedia.net.in

# టీ-మీడియా

సంపుటి : 8
సంచిక : 326
పేజీలు : 3
మంగళవారం 30.06.2026

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




# చర్చలు ఉన్నాయన్న ట్రంప్



## లేదంటున్న ఇరాన్

## నేటి దోహా సమావేశంపై సందిగ్ధత!



**టి మీడియా, జూన్ 29, ఢిల్లీ బ్యూరో:** ఇరాన్‌తో చర్చల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఖతార్ రాజధాని దోహాలో నేడు అమెరికా, ఇరాన్ ప్రతినిధుల మధ్య చర్చలు ఉంటాయని తెలిపారు. టెహ్రాన్ అభ్యర్థన మేరకు చర్చలకు అంగీకరించానని ట్రంప్ చెప్పారు. ఇరాన్ మాత్రం ట్రంప్ ప్రకటనను తోసిపుచ్చింది. తదుపరి చర్చల షెడ్యూల్ ఏదీ ఖరారు కాలేదని తెలిపింది. పరిస్థితులు చక్కబడిన తర్వాతే చర్చలు ఉంటాయని స్పష్టతనిచ్చింది. దీనితో దోహా సమావేశంపై సందిగ్ధత ఏర్పడింది. పశ్చిమాసియాలో 4 నెలల పాటు కొనసాగిన ఘర్షణకు ముగింపు పలుకుతూ ఇటీవల అమెరికా-ఇరాన్‌లు మధ్యంతర ఒప్పందం కుదుర్చుకున్నాయి. అయితే గత ఐదు రోజులుగా ఇరుదేశాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నాయి. ఫలితంగా అవగాహన ఒప్పందంపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించేందుకు ఖతార్, పాకిస్థాన్‌లు ప్రయత్నిస్తున్నాయి.

### తాత్కాలిక ఒప్పందంలో ఏమున్నాయ్??

ఈ నెల ప్రారంభంలో అమెరికా, ఇరాన్ దేశాలు ఒక తాత్కాలిక శాంతి ఒప్పందానికి అంగీకరించాయి. దీని ప్రకారం టెహ్రాన్? వద్ద ఉన్న శుద్ధిచేసిన యురేనియం నిల్వలను పూర్తిగా తగ్గించుకోవాలి, హర్మూజ్? జలసంధిని తెరవాలి. దీనికి ప్రతిగా అమెరికా, ఇరాన్?పై విధించిన ఆంక్షలను సడలిస్తుంది. మరింత క్లియర్?గా ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి ఇరుపక్షాలకు 60 రోజుల సమయం లభిస్తుంది. ఈ తాత్కాలిక ఒప్పందంపై సంతకాలు జరిగిన తర్వాత చమురు ధరలు గణనీయంగా తగ్గాయి. అయితే ఇవి కనుక మళ్లీ పెరిగితే, ట్రంప్?నకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే నవంబర్?లో అమెరికాలో ఎన్నికలు జరగనున్నాయి. అందుకే దేశంలో ద్రవ్యోల్బణం తగ్గుతోందంటూ ట్రంప్ ఓటర్లకు చెబుతున్నారు. ఒక వేళ పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగి, చమురు ధరలు పెరిగితే, అమెరికాలో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. ఇది ఎన్నికల ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం నాడు ఖతార్?లోని దోహాలో యూఎస్?-ఇరాన్ సమావేశం ఉంటుందని ట్రంప్ ప్రకటించారు. అయితే ఇరాన్ సంప్రదింపుల అధికారి ఘరీబాబాది ఈ సమావేశానికి సంబంధించి ఎలాంటి షెడ్యూల్ ఖరారు కాలేదని తేల్చిచెప్పారు. అంతకుముందు సోమవారం ఇరాన్ అధ్యక్షుడు మసౌద్? పెజెష్కియాన్? మాట్లాడుతూ, ఖతార్?లో నిలిచిపోయిన (ఫ్రీజ్ అయిన) 6 బిలియన్ల అమెరికన్? డాలర్ల తమ? ఆస్తులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ నిధుల గురించి ఆయన ప్రస్తావించడం, తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని ఇరాన్ ప్రజలకు అనుకూలంగా చూపించడానికేనని తెలుస్తోంది.

పర్షియన్ గల్ఫ్? నుంచి లోపలి వచ్చే, బయటకు వెళ్లే రవాణా ఓడల కోసం ఒమన్ ప్రాంతీయ జలాలను తెరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మరోవైపు హర్మూజ్? జలసంధిపై ఇరాన్? పట్టుకు పరీక్ష ఎదురవుతోంది. ఈ నేపథ్యంలోనే దోహాలో ఇరుదేశాల మధ్య మళ్లీ చర్చలు జరగనున్నాయని మధ్యవర్తి పాకిస్థాన్? తెలిపింది.

### మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతలు

వాస్తవానికి హర్మూజ్ జలసంధి ఇరాన్?, ఒమన్ ప్రాంతీయ జలాల్లో ఉన్నప్పటికీ, ఇది చాలా కాలంగా అంతర్జాతీయ జలమార్గంగా పరిగణించబడింది. కానీ పశ్చిమాసియాలో ఇరాన్? వర్సెస్? అమెరికా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధం జరిగింది. దీనితో ఈ జలసంధిపై తమకే హక్కు ఉందని ఇరాన్? ప్రకటించుకోవడం మొదలుపెట్టింది. దీనికి అమెరికా, ఇజ్రాయెల్?లు ససేమిరా అంటున్నాయి. ఇదిలా ఉండగా, ఇటీవల రోజుల్లో ఇరాన్ రెండు సార్లు హర్మూజ్? జలసంధిలోని నౌకలపై దాడులు చేసింది. దీనికి ప్రతీకారంగా అమెరికా వైమానిక దాడులు నిర్వహించింది. ఇరాన్? ఆదివారం నాడు బహ్రెయిన్?, కువైట్?లను లక్ష్యంగా చేసుకొని డ్రోన్?, క్షిపణి దాడులు చేసింది. ఇవి పశ్చిమాసియా ఉద్రిక్తతలకు ముగింపు పలికేందుకు జరుగుతున్న చర్చలకు తీవ్ర ఆటంకం కలిగించే అవకాశం ఉంది.

# ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

- **టీవీకే ప్రభుత్వంపై స్టాలిన్ విమర్శలు**


**టి మీడియా, జూన్ 29, చెన్నై :** తమిళనాడులోని విజయ్ ప్రభుత్వంపై మాజీ సీఎం, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారంలో ఉన్న టీవీకే ప్రభుత్వం పూర్తి ఐదేళ్ల పదవీకాలాన్ని పూర్తి చేయకపోవచ్చని సూచించారు. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వం మైనారిటీ ప్రభుత్వమని, మరో మూడు నుంచి ఆరు నెలల్లోనే రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉందని ఆయన వ్యాఖ్యానించారు. చెన్నైలో ఆదివారం జరిగిన పార్టీ చేరిక కార్యక్రమంలో ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

### 'మెజారిటీ లేకుండానే అధికారంలోకి

అధికార టీవీకే పార్టీకి స్వతంత్రంగా పాలించేంత ప్రజా మద్దతు లేదని స్టాలిన్ విమర్శించారు. టీవీకేకు అసెంబ్లీలో అవసరమైన 118 స్థానాల మెజారిటీ లభించలేదని, కేవలం 108 స్థానాలకే పరిమితమైందని అన్నారు. ప్రజలు వాస్తవానికి డీఎంకే అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ఓటు వేశారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల వరకు డీఎంకే నేతృత్వంలోని కూటమిలో ఉన్న కొన్ని పార్టీలు వ్యూహాత్మకంగా టీవీకేకు మద్దతు ఇవ్వడంతోనే ఆ ప్రభుత్వం కొనసాగుతోందని ఆయన ఆరోపించారు.

### ఎప్పుడు కూలిపోతుందో తెలియని ప్రభుత్వం

ప్రస్తుత ప్రభుత్వం చాలా బలహీనమైన ఏర్పాటుపై నడుస్తోందని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఈ రాజకీయ వాహనం ఏ దశలో సమతుల్యతను కోల్పోయి ఆగిపోతుందో చెప్పలేమని అన్నారు. ఎన్నికలు ఎప్పుడైనా రావచ్చని చెప్పారు. అది మూడు లేదా ఆరు నెలల్లోనైనా ఎన్నికలు రావచ్చని, ఐదేళ్ల పదవీకాలం పూర్తయ్యే వరకు వేచి చూసే పరిస్థితి లేదని పేర్కొన్నారు. ఎప్పుడైనా రాజకీయ పరిణామాలు మారే అవకాశం ఉన్నందున పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇప్పటి నుంచే ఎన్నికల మూడ్‌లోకి వెళ్లాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. ఎన్నికల తేదీలు ప్రకటించిన తర్వాత సన్నాహాలు ప్రారంభించడం సరిపోదని, డీఎంకేను మళ్లీ అధికారంలోకి తీసుకురావాలంటే క్షేత్రస్థాయిలో వెంటనే పని ప్రారంభించాలని సూచించారు. ఇటీవల జరిగిన 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే 107 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఈ ఫలితం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టించింది. అయితే ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన పూర్తి మెజారిటీకి కొద్దిగా దూరంలో నిలవడంతో ఇతర పార్టీల మద్దతుతో అధికారాన్ని చేపట్టింది. గతంలో డీఎంకే కూటమిలో ఉన్న కాంగ్రెస్, వామపక్ష పార్టీలు వీసీకే, ఐయూఎంఎల్ వంటి పార్టీలు టీవీకేకు మద్దతు ఇచ్చాయి.



### కొత్త రాజకీయ కూటమి దిశగా ప్రయత్నాలు

మరోవైపు ప్రభుత్వం ఏర్పడి దాదాపు 50 రోజులు పూర్తవుతున్న నేపథ్యంలో, మద్దతు పార్టీలన్నింటినీ ఒకే కూటమిగా కొనసాగించేందుకు టీవీకే ప్రయత్నాలు ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ పార్టీలు డీఎంకే కూటమిని వీడడంతో, టీవీకే నేతృత్వంలో కొత్త రాజకీయ కూటమి ఏర్పాటు దాదాపు ఖాయమనే ప్రచారం సాగుతోంది. టీవీకే నేతలు మద్దతు పార్టీలతో సంప్రదింపులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జులై 1న జరగనున్న సమావేశానికి అధికారిక ఆహ్వానం అందజేశారు. ఈ సమావేశంలో కొత్త కూటమి పేరు, కూటమి నాయకత్వం, భాగస్వామ్య పార్టీల తరఫున సమన్వయకర్తల నియామకం వంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. అదేవిధంగా తమిళనాడుకు సంబంధించిన కీలక సమస్యలు అయిన కావేరి జల వివాదం, మేకేదాటు ప్రాజెక్టు, ద్విభాషా విధానం వంటి అంశాలపై ఉమ్మడి కార్యాచరణ ప్రణాళికను కూడా రూపొందించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జులై 1 సమావేశంలో కూటమి పేరు, నాయకత్వం, ఉమ్మడి వ్యూహంపై స్పష్టత వస్తే, ఈ కూటమి 2029 పార్లమెంట్ ఎన్నికలతో పాటు 2031 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగవచ్చనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. కూటమిని ఏర్పాటు చేసే దిశగా విజయ్? ప్రయత్నాలు కొనసాగుతుండగా, మరోవైపు స్టాలిన్ మాత్రం ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదని అంటున్నారు. దీంతో తమిళనాడు రాజకీయాల్లో మరోసారి చర్చ మొదలైంది.

## జూలై 10న ఖాతాల్లోకి

# తల్లికి వందనం నిధులు



**టి మీడియా, జూన్ 29,అమరావతి బ్యూరో**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మక తల్లికి వందనం పథకం నిధుల జమ తేదీని ఖరారు చేసింది. పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో, అర్హులైన తల్లుల బ్యాంకు ఖాతాల్లో జూలై 10న నగదు జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత ఏడాది మాదిరిగానే ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థుల తల్లులకు ఈ ఆర్థిక సాయం అందుతుంది. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి విడివిడిగా నిధులు అందజేయడం ఈ పథకం ప్రత్యేకత. దీని కోసం ప్రభుత్వం సుమారు 9 వేల కోట్ల రూపాయలను కేటాయించింది.

### మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ప్రాముఖ్యత

నిధులు జమ చేసే రోజే రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. విద్యా ప్రమాణాలను పెంచడం, విద్యార్థుల చదువుపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించడం ఈ సమావేశం ప్రధాన ఉద్దేశ్యం. పథకం ద్వారా అందుతున్న నిధుల వినియోగం, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల గురించి కూడా తల్లిదండ్రులకు వివరించనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల చదువుపై తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

### అనాథ పిల్లలకు కూడా పథకం వర్తింపు

ఈ ఏడాది సుమారు 68 లక్షల మందికి ఈ పథకం వర్తించనుందని అధికారులు గుర్తించారు. గతంలో కంటే అదనంగా లబ్ధిదారుల సంఖ్య పెరగడంతో అందుకు అనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యంగా అనాథ పిల్లలకు కూడా తల్లికి వందనం నిధులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించి ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది. ప్రభుత్వం త్వరలోనే దీనిపై పూర్తి స్థాయి అధికారిక ప్రకటన విడుదల చేయనుంది. తల్లులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు పిల్లల విద్యను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం.



# నకిలీ విత్తనాల ముఠా ఆగడాలు

- **తూతూమంత్రంగా తనిఖీలు...**
- **నాణ్యత చెకింగ్‌లోనూ నిర్లక్ష్యమే!**

**టీ మీడియా జూన్ 29,హైదరాబాద్:**

వ్యవసాయ సీజన్ ప్రారంభమైతే చాలు... తెలంగాణలో నకిలీ విత్తనాల ముఠాలు మళ్లీ చురుగ్గా మారుతున్నాయి. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని నాసిరకం, నకిలీ విత్తనాలను అసలు బ్రాండ్ల పేర్లతో విక్రయిస్తూ కోట్ల రూపాయల దందా సాగుతోంది. ప్రభుత్వం ప్రతి ఏడాది తనిఖీలు, నమూనాల సేకరణ, కేసుల నమోదుపై ప్రకటనలు చేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితుల్లో ఆశించిన మార్పు కనిపించడం లేదు.

తగ్గిన తనిఖీలు... పెరిగిన ప్రమాదం

అధికారిక గణాంకాల ప్రకారం 2023లో 14,351 డీలర్ల తనిఖీలు జరగ్గా, 2024లో అవి 1,293కు పడిపోయాయి. 2025, 2026 సంవత్సరాలకు సంబంధించి తనిఖీల వివరాలు లేకపోవడం అధికార యంత్రాంగం నిర్లక్ష్యాన్ని ప్రశ్నించేలా ఉంది.

అయితే నమూనాల సేకరణ మాత్రం కొనసాగుతోంది. 2026లో ఇప్పటివరకు 260 నమూనాలు సేకరించగా, కేవలం 571 శాంపిల్స్ మాత్రమే పరీక్షించబడ్డాయి. వార్షిక లక్ష్యం 12 వేల శాంపిల్స్ అయినా, ప్రస్తుత వేగం

మిగతా 3లో..

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

**టి మీడియా, జూన్ 29, ఢిల్లీ బ్యూరో**



రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ పీ సీ మోదీ బులెటిన్ విడుదల చేశారు. అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్?లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మరింత బలమైన సమన్వయం కోసం ఎదురుచూస్తున్నాను. తద్వారా మనమందరం కలిసి అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని మరింత జవాబుదారీగా చేయగలం. ప్రజల తీవ్రమైన ఆందోళనలు, ఆకాంక్షలు, గొంతులను మేము చిత్తశుద్ధితో, దృఢ విశ్వాసంతో, సంకల్పంతో లేవనెత్తుతూనే ఉంటాం. అదే మా ప్రధాన కర్తవ్యం. ఇది నా బాధ్యత కూడా. దీనిని నేను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తాను." అని ఖర్గే ఎక్స్?లో రాసుకొచ్చారు.

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు. నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపుర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఛైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభ నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు.



# బెల్ట్ షాప్ ఓనర్లకు షాకిచ్చిన సర్పంచ్



- **ఆరుగురి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ తొలగింపు**

**టి మీడియా, జూన్ 29, చిల్పూరు :**
మద్యపాన నిషేధాన్ని ఉల్లంఘించిన ఆరుగురు మద్యం గొలుసు దుకాణాల నిర్వాహకుల ఇళ్లకు ఓ గ్రామ సర్పంచి విద్యుత్తు సరఫరాను నిలిపివేయించారు. ఈ సంఘటన జనగామ జిల్లా చిల్పూరు మండలం నష్కల్‌లో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే,జనగామ జిల్లా నష్కల్ గ్రామంలో గతంలో 20 మందికి పైగా విచ్చలవిడిగా మద్యం అమ్మేవారు. ఈ క్రమంలో గ్రామంలోని యువత మద్యానికి బానిసై బంగారు భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని గ్రహించి మద్యపాన నిషేధానికి తీర్మానం చేశారు. గత కొద్ది రోజుల పాటు బాగానే కొనసాగింది. అయితే గ్రామంలో బొడ్రాయి పండుగ నిర్వహించగా మళ్లీ కొంతమంది గుట్టు చప్పుడు కాకుండా మద్యం అమ్మడం మొదలుపెట్టారు.సమాచారం అందుకున్న సర్పంచ్ విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఆరుగురు అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించారు. వెంటనే వారి ఇళ్లకు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. మళ్లీ ఇక ఎప్పుడు గ్రామపంచాయతీ నిబంధనలు ఉల్లంఘించమని బాండ్ పేపర్?పై రాసుకొస్తేనే విద్యుత్ కనెక్షన్ పునఃప్రారంభిస్తామని సర్పంచి రాజు వారికి స్పష్టం చేశారు.

**13వ శతాబ్దం నాటి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం**
జనగామ జిల్లా చిల్పూర్ మండలంలోని నష్కల్ గ్రామం ఒక గొప్ప ఆధ్యాత్మిక, చారిత్రక వారసత్వాన్ని తనలో దాచుకొంది. ఈ గ్రామంలో ప్రధానంగా కాకతీయుల కాలం నాటి చరిత్ర నేటికీ సజీవంగా దర్శమిస్తుంది. భక్తి, చరిత్ర, సంస్కృతి, ఆచార వ్యవహార, సంప్రదాయాలను కొనసాగిస్తున్న గ్రామంగా నష్కల్ తన ప్రత్యేకతను నలుదిశలా చాటుకుంటోంది. ఈ గ్రామంలో 13వ శతాబ్దం నాటి శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయం కాకతీయుల నిర్మాణ కళకు సాక్ష్యంగా దర్శనమిస్తోంది. వారు నిర్మించిన ఈ ఆలయ శిల్పకళ కాకతీయుల వైభవానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాయి. శతాబ్దాలు గడిచినా ఈ దేవాలయం తన చారిత్రక మహిమను కోల్పోకుండా నిత్యం భక్తులను ఆకర్షిస్తూ శోభాయమానంగా వెలుగొందుతోంది. ఆలయంలోని ఆధ్యాత్మిక వాతావరణం, నిర్మాణ శైలి భక్తులను విశేషంగా మంత్రముగ్ధులను చేస్తోంది.

**భద్రాచలం తరహాలో సీతారాముల కళ్యాణం**
ఈ ఆలయంలో ప్రతి ఏటా శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. భద్రాచలం తరహాలో ఇక్కడా కూడా వేడుకలు జరుపుతారు. స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని కనులారా దర్శించేందుకు అనేక ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. భక్తి, ఆధ్యాత్మికత భావంతో గ్రామం పండుగ వాతావరణం నెలకొంటుంది.

**365 రోజులు వెలిగే అఖండ దీపం**
ఈ ఆలయంలోని అఖండ జ్యోతి మరో విశేషం. ఇది కాకతీయుల కాలంలో వెలిగించిన దీపం. ఇది సంవత్సరంలోని 365 రోజులు నిరంతరాయంగా వెలుగుతూనే ఉండటం విశేషం. గ్రామంలోని ప్రజలంతా తరతరాలుగా భక్తి, విశ్వాసంతో నేటికీ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు.

**మద్యపాన రహిత గ్రామసభ నిర్ణయం**
ఇంతటి విశిష్టత, చరిత్ర, ఆధ్యాత్మిక విలువలు కలిగిన గ్రామాన్ని పూర్తి మద్యపాన రహిత గ్రామంగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో గ్రామ సర్పంచ్? రాజు ముందడుగు వేశారు. గ్రామ ప్రజలతో కలిసి పంచాయతీ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రామంలో బెల్ట్ షాపులు నిర్వహించకూడదనే ప్రత్యేక తీర్మానాన్ని తీసుకొచ్చారు.



## 'ఉపాధి హామీ నిధులను మంజూరు చేయాలి'

- **కలెక్టర్‌కు సర్పంచుల వినతి**

**టి మీడియా, జూన్ 29, సూర్యాపేట :**
గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉపాధి హామీ నిధులను అన్ని గ్రామాలకు మంజూరు చేయాలని జాజిరెడ్డిగూడెం మండల సర్పంచులు డిమాండ్ చేశారు. సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను బీఆర్ఎస్ సర్పంచులు కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో 17 గ్రామ పంచాయతీలలో 8 గ్రామ పంచాయతీలకు మాత్రమే సీసీ రోడ్ల నిర్మాణం కోసం కోటి రూపాయలు విడుదల చేశారని తెలిపారు. బీఆర్ఎస్ సర్పంచులుగా ఉన్న 9 గ్రామాల పట్ల అధికారులు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వల్లపు గంగయ్య, కర్నాటి వెంకన్న, మేడి వీరస్వామి, బానోతు సైదులు, అంకిరెడ్డి వీరాంజనేయులు, శైలేందర్, యాదగిరి, బొడ్డు సోమరాజు పాల్గొన్నారు.

## పల్లె పాటకు ప్రాణం పోసిన సాయి చంద్

- **పలుస శంకర్ గౌడ్**



**టీ మీడియా, జూన్ 29, వనపర్తి బ్యూరో :**
ప్రముఖ గాయకుడు సాయిచంద్ వర్ధంతి ప్రభుత్వ ఆసుపత్రిలో బండారు శ్రీనివాస్ అధ్వర్యములో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ పాలుగొన్నారు. ఈ సందర్భంగా శంకర్ గౌడ్ మాట్లాడుతూ పల్లె పాటకు ప్రాణం పోసిన గాయకుడు, తెలంగాణ ముద్దుబిడ్డ సాయి చంద్ అన్నారు.ఊరు మనదిరా ఈ వాడ మనదిరా అంటూ ఉగ్రూతలూగించిన స్వరం సాయి చంద్ ఆయన పాట వింటే రైతు నాగలి పట్టుకున్నా నాట్యం చేస్తాడు. తెలంగాణ ఉద్యమంలో ఆయన గొంతు ఒక ఆయుధమైంది అన్నారు.వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పిద్దాం అన్నారు. కార్యక్రమంలో సాయి చందు మూడవ వర్ధంతి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు సాహితీ కళావేదిక అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొనాడం జరిగినది. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాస్, కవి రచయిత జనజ్వాల, సామాజికవేత గంధం నాగరాజు, ఇబ్రహీం , సానా బేగం, కృష్ణయ్య, మమత, కాసిం, అల్లిబాబు, పద్మ,రామకృష్ణ,వైద్య ఉద్యోగులు కార్యక్రమంలో పాల్గొని ఆ మహనీయునికి శ్రద్ధాంజలి ఘటించడం జరిగినది.

## ప్రజలకు గుడ్‌న్యూస్..

- **జులై ఒకటి నుంచి కొత్త పథకం**



**టీ మీడియా జూన్ 29,హైదరాబాద్ బ్యూరో :**
గ్రామీన ప్రాంతాల్లోని ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సూపర్ గుడ్‌న్యూస్ చెప్పింది. కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి దేశవ్యాప్తంగా వికసిత్ భారత్ గ్రామీణ్ గ్యారంటీ మిషన్ కొత్త గ్రామీణ ఉపాధి పథకాన్ని అమలు చేయనుంది. ఇది ప్రస్తుతం అమలులో ఉన్న మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారంటీ యాక్ట్ స్థానంలో వస్తుంది. జులై 2న దీని జాతీయ ప్రారంభోత్సవ కార్యక్రమం తిరుపతిలో జరగనుంది.. ఈ కొత్త పథకం గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీని మరింత బలోపేతం చేస్తూ, జీవనోపాధి అవకాశాలను విస్తరించడం, ఆదాయ వనరులను పెంచడం లక్ష్యంగా రూపొందించారు.

**అసలు ఏంటీ ఈ వికసిత్ భారత్ గ్రామీణ్ గ్యారంటీ మిషన్**
పథకం ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ కుటుంబాలకు ఉపాధి హామీని పెంచడం.మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష్మీపతి దీదీల సృష్టించడం..గ్రామీణ అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, సాంకేతికత వినియోగం. సోషల్ ఆడిట్, పారదర్శకత పెంచడం లక్ష్యంగా ఈ పథకం అమలుకానుంది.. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, నైపుణ్యాభివృద్ధి, స్థిరమైన జీవనోపాధి వంటి లక్ష్యాలను సాధించాలని కేంద్రం భావిస్తోంది.ఇప్పటికే రాష్ట్రాలు తమ అమలు సన్నాహాలను పూర్తి చేసుకోవాలని కేంద్రం సూచించింది.ఈ పథకం అమలుతో దేశవ్యాప్తంగా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మరింత బలపడటం సహా వికసిత భారత్ లో భాగంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి సాధ్యమవుతుందని కేంద్రం భావిస్తుంది.

## చేపల వేటకు వెళ్లి శవాలుగా మారిన మామ అల్లుడు..

- **బైక్‌కు శవాలను కట్టేసిన ఘటన!**



**టీ మీడియా జూన్ 29, కృష్ణా :**
కృష్ణాజిల్లా పెడన నియోజకవర్గం కృత్తివెన్ను మండలంలో అత్యంత అమానుషమైన ఘటన వెలుగులోకి వచ్చింది. చిన్న గొల్లపాలెం గ్రామంలో చేపల వేటకని వెళ్లిన ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను వెలికితీశారు. ఇందుకు సంబంధించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.
స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కొత్త కాలవ మొగ సమీపంలో రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. అయితే, ఈ మృతదేహాలు ఒక బైక్‌కు తాళ్లతో కట్టి ఉండటం చూసి స్థానికులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. మరణించిన వారిని శెట్టి సుబ్బన్న, గొలుసు అయ్యప్పగా గుర్తించారు. వీరిద్దరూ వరసకు మామ, అల్లుళ్లు అని గ్రామస్థులు తెలిపారు. చేపల వేట కోసం వెళ్లిన వీరు ఇలా విగతజీవులుగా, అదీ బైక్‌కు కట్టేసి ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తోంది. ఇది ముమ్మాటికీ హత్యేనని, ఎవరో దారుణంగా చంపి ఇలా బైక్‌కు కట్టేసి ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ ఘోర ఉదంతంపై సమాచారం అందుకున్న కృత్తివెన్ను పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని, క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతానికి ఈ ఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు జరుపుతున్నారు. పాత కక్షలు ఏవైనా ఉన్నాయా? లేదా వేట ఇరువర్గాల మధ్య గొడవలకు దారితీసిందా? అనే కోణంలో విచారణ ముమ్మరం చేశారు. ఈ ఘటనతో చిన్న గొల్లపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

## యూట్యూబ్‌లో వీడియోలు చూసి


- **ప్రసవానికి ప్రయత్నించి మహిళ మృతి**



**టీ మీడియా జూన్ 29, చెన్నై:**
నిండు గర్భిణీ అయిన మహిళ, యూట్యూబ్‌లో వీడియోలు చూసి ఇంట్లోనే ప్రసవానికి ప్రయత్నించింది. బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత తీవ్ర రక్తస్రావం వల్ల ఆమె ఆరోగ్యం క్షీణించింది. పలు ఆసుపత్రులకు తరలించినప్పటికీ ఫలితంలేకపోవడంతో ఆమహిళ మరణించింది .తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఉతుకులి సమీపంలోని తలవాయ్‌పాళ్యం గ్రామానికి చెందిన 32 ఏళ్ల శశికళ, కార్తీక్ భార్యాభర్తలు. వీరికి నాలుగేళ్ల కుమార్తె ఉన్నది.కాగా, శశికళ రెండోసారి గర్భందాల్చింది. అయితే సిజేరియన్ వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై ఆమె ఆందోళన చెందింది. ఈ నేపథ్యంలో ఆసుపత్రిలో కాకుండా ఇంట్లోనే సహజంగా ప్రసవించేందుకు ప్రయత్నించింది. దీని కోసం యూట్యూట్‌లో సహజ ప్రసవాలకు సంబంధించిన వీడియోలు చూసింది.మరోవైపు జూన్ 24న శశికళ ఇంట్లోనే ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ప్రసవం తర్వాత ఆమెకు తీవ్ర రక్తస్రావమైంది. రక్తం ఆగకపోవడంతో పెరుందురైలోని ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి ఆ మహిళను తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కోయంబత్తూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ ఆమె మరణించింది.కాగా, ఈ సమాచారం తెలుసుకున్న జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఉతుకులి పోలీసులు కూడా ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## మాదిగల స్థలం ఆక్రమించి అక్రమ గృహ నిర్మాణం


- **వారికి వత్తాను పలికిన మున్సిపల్ అవినీతి అధికారులు**
- **న్యాయం చేయాలని కోరుతూ కలెక్టర్ కు మాదిగలు వినతి**



**టీ మీడియా, జూన్ 29, వనపర్తి బ్యూరో :**
వనపర్తి మున్సిపల్ నాగవరంలో 10 వార్డ్ మాదిగ కులానికి చెందిన అమాయక వృద్ధ దంపతుల స్థలం, ఎస్సి కమీటి హాల్ స్థలం 50ఐ75 వున్నది. దీనిని కోల్ల బాలస్వామి తండ్రి కోల్ల రాములు వయసు 47, కొందరు వ్యక్తులు కలిసి ఎస్సి కమిటి హాల్ స్థలం అక్రమంగా ఆక్రమించి ఇల్లు కట్టడం జరుగుతుంది. దీనిపై అతనికి అనేక సార్లు హెచ్చరికలు చేసిన మాదిగల కమిటి హాల్లోని మాదిగ వ్యక్తులును బెదిరించి అక్రమంగా ఇల్లు కట్టుకోవడం జరుగుతుంది.1990లలో అప్పట్టి ప్రభుత్వ అనగ కాంగ్రెస్ ప్రభుత్వంలో) ఇందిరా గాంధీ అధికారంలో వున్నప్పుడు హరిజనులకు సర్వే 54/2) ఒక ఎకర రెండు కుంటలు ఇండ్లు స్థలమును ఇవ్వడం జరిగింది. కావున జిల్లా సర్వేయర్ ఒక సారి సర్వే జరిపించి వారికి ఇచ్చిన కమిటి హాల్ స్థలం ఎకర రెండు కుంటల హరిజనుల ఇండ్లను సర్వే చేయగలరు అని కోరారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను సంప్రదించిన వారికి లొంగిన మున్సిపల్ అధికారులు కూడా వారికి వత్తాసు పలుకుతూ మాదిగలను బెదిరిస్తున్నారు. దీనిపై కలెక్టర్ స్పందించి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు.

## సర్ జాబితాలో పేరు లేదని మనస్తాపం..

- **జైలుకు పంపుతారన్న భయంతో ఆత్మహత్య**



**టి మీడియా, జూన్ 29, బోరబండ :**
'సర్' జాబితాలో తన పేరు లేదనే మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని భరత్‌నగర్ లంబగుండు ప్రాంతంలో చోటు చేసుకున్నది.మృతుడి కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం.. భరత్‌నగర్‌కు చెందిన షేక్ ముజీబుర్ రహ్మాన్(51) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎస్ఐఆర్ లిస్టులో పేరు లేకుంటే తనను జైలుకు పంపుతారేమోనని ఆందోళన గురయ్యాడు. తన ముగ్గురు పిల్లలను ఎవరు చూసుకుంటారని తీవ్రంగా మదనపడ్డాడు. ఈ విషయమై శనివారం రాత్రి భార్య ఇస్మాయిల్‌బీ ఎంత నచ్చజెప్పినప్పటికీ మనస్తాపం వీడలేదు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున ఇంటి బయట ఉన్న షెడ్డు ఇనుప రాడ్‌కు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుటుంబాన్ని కోల్పోయిన ఫుట్‌బాల్ ప్లేయర్..

- **శిథిలాల కిందే ఆశలు సమాధి**



**టి మీడియా, జూన్ 29, ఢిల్లీ బ్యూరో :**
వెనెజువెలా లో ఇటీవల సంభవించిన జంట భూకంపాలు ఎన్నో కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపాయి. ఈ విపత్తులో అర్జెంటీనా ఫుట్‌బాలర్ లుకాస్ ట్రెజో తన కుటుంబాన్ని కోల్పోయారు. భవనం కూలిపోవడంతో భార్య, ఇద్దరు పిల్లలు శిథిలాల కింద నలిగిపోయారు. వారి మరణాన్ని ఫుట్‌బాల్ క్లబ్ 'డిపోర్టివో లా గువేరా' ధ్రువీకరించింది.ఈ భూకంపం ధాటికి వెనెజువెలాలోని యారకూ ప్రాంతం అతలాకుతలమైంది. అక్కడి పలు భవనాలు నేలమట్టమయ్యాయి. లుకాస్ కుటుంబం ఉన్న భవనం కూడా కూలడంతో అతడి భార్య యానినా మారనెల్లా, ఇద్దరు పిల్లలు గల్లంతయ్యారు. వారిని గుర్తించేందుకు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టినా ఫలితం లేకపోయింది. ఆ ముగ్గురు శిథిలాల కింద ప్రాణాలు విడిచారు. అప్పుడు ఫుట్‌బాలర్ తన టీమ్‌తో వేరే ప్రాంతంలో ఉండటంతో ప్రాణాలతో బయటపడ్డాడు.
భూకంపం తర్వాత తన భార్య, పిల్లలు గల్లంతయ్యారన్న వార్త వినగానే షాక్‌కు గురైన లుకాస్.. అక్కడకు చేరుకొని తన కుటుంబం కోసం శిథిలాలను తొలగిస్తూ వెతకడం ప్రారంభించాడు. వారిని ఎలాగైనా ప్రాణాలతో గుర్తించాలని అతడు చేసిన ప్రయత్నం తోటివారిని కంటతడి పెట్టించింది.
ఇదిలావుంటే భూకంపం ధాటికి అతలాకుతలమైన వెనెజువెలాకు బ్రెజిల్ స్టార్ ఫుట్‌బాలర్ నెయ్‌మర్ ఆపన్న హస్తం అందించాడు.ఏకంగా 2,50,000 డాలర్లు (భారత కరెన్సీలో దాదాపు రూ.2.35 కోట్లు) విరాళంగా ప్రకటించాడు. ప్రభావిత ప్రాంతాల ప్రజలకు ఆహారం, తాగునీరు, వైద్యసహాయం అందించేందుకు ఈ నిధులను ఉపయోగించనున్నారు. ఈ జంట భూకంపాలవల్ల 60 లక్షల మందికిపైగా ప్రభావితమయ్యారు. ఇప్పటివరకు 1400 పైగా మృతదేహాలను గుర్తించినట్లు అక్కడి ప్రభుత్వం వెల్లడించింది. గల్లంతయినవారి సంఖ్య వేలల్లోనే ఉందని ఐరాస అంచనా వేసింది.వారిని ప్రాణాలతో రక్షించేందుకు తొలి 72 గంటలే కీలకం. ఇప్పటికే ఆ సమయం కూడా గడిచిపోవడంతో తమ వారి కోసం ఎదురుచూస్తోన్న కుటుంబాల ఆశలు సన్నగిల్లుతున్నాయి. ముఖ్యంగా తీరప్రాంతం కలిగిన లా గువేరా మరుభూమిని తలపించింది. 'హోటల్ ఎడ్వర్డ్' పేకమేడలా కూలి గుర్తుపట్టలేని విధంగా ధ్వంసమైంది. అందులో బసచేసిన పలువురు స్టార్ ఆటగాళ్ల కుటుంబాలు శిథిలాల కింద చిక్కుకున్నాయని వార్తలు వచ్చాయి.మరోవైపు తన భార్య ప్రాణాలు కోల్పోయిందని వెనెజువెలా ఫుట్‌బాల్ ఆటగాడు హెక్టర్ బెల్లో పెట్టిన ఇన్‌స్టా స్టోరీ వైరల్ అయ్యింది. ఏడాది వయసున్న కుమార్తెను కాపాడి ఆమె ప్రాణాలు విడిచింది.

## ఆర్టీసీ బస్సు బోల్తా.. 10 మందికి తీవ్ర గాయాలు



**టి మీడియా, జూన్ 29,పెబ్బేరు :**
తెలంగాణలోని వనపర్తి జిల్లాలో సోమవారం ఒక ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పెబ్బేరు సమీపంలో ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా రోడ్డుపై అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో ప్రయాణిస్తున్న వారిలో సుమారు 10 మందికి పైగా తీవ్ర గాయాలయ్యాయి. ఆంధ్ర-కర్ణాటక సరిహద్దులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం నుండి వనపర్తి వైపు వస్తుండగా ఈ ప్రమాదం సంభవించినట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు.ప్రమాద వివరాల్లోకి వెళితే.. ఆర్టీసీ బస్సు జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న క్రమంలో, హఠాత్తుగా బస్సు ముందుకు ఒక ద్విచక్రవాహనం వచ్చింది. ఆ ద్విచక్రవాహనదారుడిని ఢీకొట్టకుండా కాపాడాలనే ఉద్దేశంతో బస్సు డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేసి, స్టీరింగ్‌ను పక్కకు తిప్పాడు. ఈ క్రమంలో వేగ నియంత్రణ కోల్పోయిన ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లి అదుపుతప్పి బోల్తా పడింది. డ్రైవర్ సకాలంలో అప్రమత్తం కావడంతో ప్రయాణికులంతా స్వల్ప గాయాలతో బయటపడ్డారని, ఒక పెద్ద ప్రాణనష్టం తప్పిందని పోలీసులు పేర్కొన్నారు.

**ఆసుపత్రికి క్షతగాత్రులు**
ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక ప్రజలు, తోటి వాహనదారులు మానవత్వంతో వేగంగా స్పందించారు. వెంటనే బస్సు అద్దాలు పగులగొట్టి లోపల చిక్కుకున్న ప్రయాణికులను సురక్షితంగా బయటకు తీశారు. ఈ ఘటనలో గాయపడిన 10 మంది క్షతగాత్రులను 108 అంబులెన్స్ సహాయంతో తక్షణమే చికిత్స నిమిత్తం పెబ్బేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం క్షతగాత్రులకు ప్రాణాపాయం ఏమీ లేదని వైద్యులు ప్రాథమికంగా ధృవీకరించారు.ప్రధాన రహదారిపైనే బస్సు బోల్తా పడటంతో ఆ మార్గంలో వాహనాలు భారీగా నిలిచిపోయి కాసేపు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది. ప్రమాదంపై సమాచారం అందుకున్న పెబ్బేరు పోలీసులు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో బోల్తా పడిన బస్సును రోడ్డు పక్కకు తొలగించి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు.

## అమెరికా వరదల్లో పర్చూరు యువకుడు గల్లంతు

- **ఆందోళనలో కుటుంబ సభ్యులు**



**టి మీడియా, జూన్ 29, బాపట్ల :**
ఉపాధి, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన ఆంధ్రప్రదేశ్ యువకుడు అక్కడ సంభవించిన భారీ వరదల్లో గల్లంతయ్యాడు. బాపట్ల జిల్లాకు చెందిన ఈ యువకుడి ఆచూకీ ఇంకా లభించకపోవడంతో అతని తల్లిదండ్రుల్లో తీవ్ర విషాదం, ఆందోళన నెలకొన్నాయి. కుమారుడి పరిస్థితిపై ఎలాంటి సమాచారం లేకపోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.ఘటనకు సంబంధించిన వివరాలు: బాపట్ల జిల్లా పర్చూరు మండలం దేవరపల్లి గ్రామానికి చెందిన దొప్పలపూడి రాంబాబు, అనురాధ దంపతులకు ఇద్దరు కుమారులు. వారి పేర్లు వెంకటేశ్, రామకృష్ణ. పెద్ద కుమారుడైన వెంకటేశ్ ఉన్నత చదువుల నిమిత్తం మూడేళ్ల క్రితం అమెరికా వెళ్లారు. అక్కడ ఎంఎస్ పూర్తి చేసిన ఆయన, ప్రస్తుతం మంచి ఉద్యోగంలో స్థిరపడ్డారు.అయితే ఇటీవల అమెరికాలోని కాన్సాస్ రాష్ట్రంలో భారీ వర్షాలు, ఊహించని రీతిలో వరదలు ముంచెత్తాయి. ఈ క్రమంలో వెంకటేశ్ వరద నీటిలో గల్లంతైనట్లు తెలుస్తోంది. ఆయన ప్రయాణించిన కారు, అందులోని బ్యాగును స్థానిక అధికారులు గుర్తించారు. కానీ కారులో వెంకటేశ్ లేకపోవడం, ఆయన మొబైల్ ఫోన్ కూడా పనిచేయకపోవడంతో వరద ఉధృతికి కొట్టుకుపోయి ఉంటారని బంధువులు అనుమానిస్తున్నారు. కారు దొరికినా వెంకటేశ్ ఆచూకీ లభించకపోవడంతో దేవరపల్లిలోని ఆయన కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు.స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు: ఈ విషయం స్థానిక పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి వెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అమెరికాలోని తెలుగు సంఘాలు, అధికారులతో మాట్లాడి యువకుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని కోరారు.కేంద్ర, రాష్ట్ర మంత్రులకు లేఖలు: బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందించేందుకు, అమెరికాలోని భారత రాయబార కార్యాలయం ద్వారా ఒత్తిడి తెచ్చేందుకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ మేరకు ఆయన కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్‌లకు లేఖలు రాశారు. అమెరికాలోని కాన్సాస్ అధికారులతో ఉన్నత స్థాయిలో మాట్లాడి, ప్రత్యేక బృందాల ద్వారా వెంకటేశ్ ఆచూకీని త్వరగా గుర్తించేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖల్లో ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐఆర్ పంపిణీలో బిఆర్ఎస్ శ్రేణులు



**టీ మీడియా, జూన్ 30 పెబ్బేరు:**
పెబ్బేరు పట్టణంలోఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో బాగంగా పట్టణంలోనీ 4 7 11 12వ వార్డ్ లలో రెవిన్యూ అధికారులు బిఎల్ఓ జి రాధమ్మ తో పాటు కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ పట్టణ పార్టీ అద్యక్షుడు వి దిలీప్ కుమార్ రెడ్డి ఆద్వర్యంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ పున్న విశ్వరూపం శివ శంకర్ గౌడ్ వి సాయిరెడ్డి సంబు రాము మహానంది నరేందర్ రెడ్డి రమేష్ పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



## ఒకే రోజు మూడు హత్యలు..

- **ఉలిక్కిపడిన బెంగళూరు**

**టి మీడియా, జూన్ 29, బెంగళూరు:**
ఒకే రోజు మూడు హత్యలు జరిగాయి. వేర్వేరుగా జరిగిన ఈ సంఘటనల్లో ఇద్దరు మహిళలు హత్యకు గురికాగా, ఒక నేరస్తుడ్ని పత్యర్థులు నరికి చంపారు. ఈ మూడు హత్యలతో రాజధాని నగరం ఉలిక్కిపడింది. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ మూడు సంఘటనలు జరిగాయి. ఆదివారం మహాలక్ష్మి లేఅవుట్‌లో మొదటి హత్య జరిగింది. పెళ్లి విషయంలో గొడవ కారణంగా 23 ఏళ్ల అంజలిని ఆమె ప్రియుడు రాజీవ్, కత్తితో పొడిచి హత్య చేశాడు. వీరిద్దరూ మూడేళ్లకు పైగా ప్రేమలో ఉన్నారని పోలీసులు తెలిపారు. అయితే రాజీవ్ నేర చరిత్ర కారణంగా ఆ యువతి కుటుంబం వారి సంబంధాన్ని వ్యతిరేకించినట్లు తెలిసిందన్నారు. నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. కాగా, అదే రోజున కొన్ని గంటల్లోనే బొమ్మనహల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని మునియప్ప లేఅవుట్‌లో మరో మహిళ హత్యకు గురైంది. అద్దె ఇంట్లో నివసిస్తున్న 40 కృష్ణ బర్మన్ గొంతు నులిమి చంపి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. ఆమె హత్యపై దర్యాప్తు చేస్తున్నారు. ఆ మహిళ ఇటీవల ఎవరితో మాట్లాడింది? ఆమె కదలికలు, ఇతర వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.మరోవైపు ఆదివారం సాయంత్రం జేపీ నగర్ రోడ్డులోని ఐజీ సర్కిల్ సమీపంలో బహిరంగంగా మూడో హత్య జరిగింది. హత్య, హత్యాయత్నం, దోపిడీతో సహా పలు క్రిమినల్ కేసులున్న నేరస్థుడు రాజా అలియాస్ హల్కుక్ రాజాను కారులో వచ్చిన దుండగులు వెంబడించారు. కత్తులు, కొడవళ్లతో దాడి చేసి నరికి చంపారు. పాత కక్షలు, ప్రతీకార చర్యగా ప్రత్యర్థులు అతడ్ని హత్య చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.అయితే ఒకే రోజు మూడు హత్యలు జరుగడంతో బెంగళూరు వాసులు ఉలిక్కిపడ్డారు. రాజధాని నగరంలో శాంతిభద్రతలపై ఆందోళన చెందుతున్నారు.

# హైదరాబాద్ టు చెన్నై ఇక 2 గంటల్లోనే



**టి మీడియా, జూన్ 29, హైదరాబాద్ బ్యూరో :**
దక్షిణ భారతదేశ రవాణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి హైదరాబాద్-అమరావతి-చెన్నై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్ట్ సిద్ధమవుతోంది. ఈ హై స్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణానికి నేషనల్ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు 760 కిలోమీటర్ల మేర సాగే ఈ ప్రాజెక్ట్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలను కలుపుతుంది. గతంలో ఉన్న ప్రణాళికలను సవరించి, అమరావతి రాజధాని ప్రాంతం మీదుగా ఈ మార్గాన్ని మార్చడం ప్రయాణికులకు పెద్ద ఊరట. పన్నెండు గంటల ప్రయాణ సమయం కేవలం రెండు గంటల ఇరవై నిమిషాలకు తగ్గనుంది. ఆంధ్రాలో అత్యధికంగా 518 కిలోమీటర్ల ట్రాక్ ఉండటంతో రాష్ట్రానికి భారీ ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయి. తిరుపతిని ఈ ప్రాజెక్టులో కీలక కేంద్రంగా మార్చడం ద్వారా ఆధ్యాత్మిక పర్యాటకానికి మరింత ప్రాధాన్యత పెరగనుంది. కేంద్ర రైల్వే శాఖ తుది ఆమోదం కోసం అధికారులు డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు.

**రూట్ మ్యాప్ అలాగే కీలకమైన స్టేషన్లు**
ఈ రైల్వే మార్గం హైదరాబాద్ ఐటీ హబ్స్ నుండి ప్రారంభమై శంషాబాద్ మీదుగా ఆంధ్రప్రదేశ్ లోకి ప్రవేశిస్తుంది. దాచెపల్లి, గుంటూరు, అమరావతి, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, తిరుపతి ఈ కారిడార్ లో ప్రధాన స్టేషన్లుగా నిలవనున్నాయి. ఆంధ్రప్రదేశ్ పరిధిలో మొత్తం 9 స్టేషన్లను ఏర్పాటు చేయడం ద్వారా వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి బాటలు పడనున్నాయి. తమిళనాడులో తిరువళ్లూరు, మింజూర్ స్టేషన్ల ద్వారా చెన్నై సెంట్రల్ కు చేరుకుంటుంది. చిత్తూరు-తిరుపతి మధ్య ప్రత్యేకంగా 65 కిలోమీటర్ల అనుసంధాన కారిడార్ ఏర్పాటు చేయనున్నారు. ఈ రూట్ చెన్నై-బెంగళూరు హై స్పీడ్ కారిడార్ తో అనుసంధానం కావడంతో దక్షిణాది నగరాల మధ్య రాకపోకలు అత్యంత సులభతరం అవుతాయి. పారిశ్రామిక వేత్తలకు, ఐటీ నిపుణులకు ఈ ప్రాజెక్ట్ ఒక గొప్ప వరంగా మారుతుంది. పక్కా ప్రణాళికతో పనులు చేపడితే త్వరలోనే అత్యాధునిక రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుంది.

**ఆర్థిక ప్రగతి అలాగే భవిష్యత్తు ప్రయోజనాలు**
హై స్పీడ్ రైల్ కారిడార్ నిర్మాణం పూర్తికావడం ద్వారా మూడు రాష్ట్రాల మధ్య వ్యాపార కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. అమరావతి రాజధానిగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో ఈ బుల్లెట్ ట్రైన్ కనెక్టివిటీ నగరంపై అంతర్జాతీయ స్థాయిలో దృష్టిని ఆకర్షిస్తుంది. బెంగళూరు నుండి చిత్తూరు, తిరుపతి మీదుగా అమరావతికి వచ్చే ప్రయాణికులకు ఇది ఎంతో అనువుగా ఉంటుంది. దక్షిణ భారతదేశంలో ప్రధాన ఆర్థిక కేంద్రాల మధ్య దూరం తగ్గడం వల్ల ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. రైల్వే శాఖ ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఈ ప్రాజెక్ట్ రవాణా రంగాన్ని సరికొత్త శిఖరాలకు చేరుస్తుంది. వేగవంతమైన ప్రయాణం ప్రజల సమయాన్ని ఆదా చేయడమే కాకుండా ఆర్థిక వృద్ధిని వేగవంతం చేస్తుంది. సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక పూర్తయిన తర్వాత నిర్మాణ పనులు శరవేగంగా సాగనున్నాయి. ఈ కారిడార్ దక్షిణ భారతావనిలో రవాణా పరంగా అతిపెద్ద మైలురాయిగా నిలిచిపోతుంది.

## విద్య ప్రతిభకు ప్రాధాన్యం



**టీ మీడియా, జూన్ 29, వనపర్తి బ్యూరో :**
నాణ్యమైన విద్యతో పాటు భారతీయ సంస్కృతి, నైతిక విలువలను పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న తమిళనాడులోని కాంచీపురం శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహావిద్యాలయం (డీమ్డ్ యూనివర్సిటీ)లో ప్రవేశాలపై సోమవారం వనపర్తిలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ శ్రీ కంచి కామకోటి పీఠం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 1993లో స్థాపితమైన ఈ విశ్వ విద్యాలయం నాణ్యమైన విద్యతో పాటు భారతీయ సంస్కృతి, నైతిక విలువలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 70 శాతం మంది విద్యార్థులు ఇక్కడ విద్య నభ్యసిస్తున్నారని తెలిపారు. ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచిత ఇంజినీరింగ్ విద్యతో పాటు హాస్టల్ ఫీజుల్లో రాయితీలు అందిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులను చెడు అలవాట్లకు దూరంగా ఉంచుతూ విలువలతో కూడిన విద్యను అందించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కళాశాలలో నాణ్యమైన శాఖాహార భోజనం, ప్రశాంతమైన విద్యా వాతావరణం, ఆధునిక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి కౌన్సెలింగ్ కార్యక్రమాలు తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, జగిత్యాల, వరంగల్, పాల్వంచ, నంద్యాల, ఆదోని, ప్రొద్దుటూరు ప్రాంతాల్లో జులై 1 వరకు కొనసాగనున్నట్లు తెలిపారు. అడ్మిషన్లకు సంబంధించిన వివరాల కోసం 96290 01144, 98496 58030 నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ముళ్లపల్లి శ్రీనివాస్, ప్రిన్సిపల్ వెంకటరమణ, ఆర్యవైశ్య సంఘం వనపర్తి పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము, వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం అయ్యగారు చంద్రశేఖర్ శర్మ, రావుస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రామ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీజే కలాం లైఫ్ టైమ్ సాధించిన అవార్డు గ్రహీత



**టీ మీడియా జూన్ 29, వనపర్తి బ్యూరో :**
ఈ నెల 20వ తారీఖున తమిళనాడు రాష్ట్రం ఊటీలో జరిగిన కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం లైఫ్ టైమ్ సాధించిన అవార్డ్ అందుకున్న వనపర్తి జిల్లా వాసి అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ కు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వాసులు, హైదరాబాద్ సన్నిహితులు మిత్రులు కలిసి పెద్ద ఎత్తున మియాపూర్ ఎస్.ఎం.ఆర్ కన్వెన్షన్ హాల్ లో సన్మానం చేయడం జరిగింది. అలాగే ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా విశ్రాంత జిల్లా రిజిస్టర్. డా"మల్లారెడ్డికి కూడా ఆయనతో పాటు సన్మానం చేయడం జరిగింది.
వనపర్తి జిల్లాలో చేస్తున్న సోషల్ ఎలిమెట్ కార్యక్రమాలను దృష్టిలో ఉంచుకుని గత సంవత్సరం సతీష్ యాదవ్ కు పాండిచ్చేరి యూనివర్సిటీ వారు డాక్టరేట్ ఇచ్చారు. ప్రస్తుతం విద్యార్థులను ప్రోత్సహిస్తూ పేద విద్యార్థులకు సహాయం చేస్తున్న కార్యక్రమాలను పరిగణానికి తీసుకుని ఊటీలో ఆయనకు ఏపీజే అబ్దుల్ కలాం అవార్డు అందజేయడం జరిగింది. దీనికిగాను డా' సతీష్ యాదవ్ సన్నిహితులు స్నేహితులు కలిసి పెద్ద ఎత్తున ఆయనకు సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు నర్సిరెడ్డి లక్ష్మణ్, విశ్వనాథం గారు, నాగభూషణం, భాస్కర్ రెడ్డి, గోపి, సుధాకర్, ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా వాసులు బద్రీనాథ్, మహేందర్, రమేష్, సాయి , మరియు జలంధర్, శ్రీనివాస్, విశ్వనాథ్, జయదేవ్ తో పాటు హైదరాబాద్, సంగారెడ్డి వాసులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## విద్యుత్ ప్రైవేటీకరణ ,పెంచిన ఎరువుల ధరలు ఆపాలి

- బండారు రవికుమార్




**టీ మీడియా, జూన్ 30 పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం లో సిపిఎం వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రెండో రోజు రాజకీయ శిక్షణ తరగతుల సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారి రవికుమార్ మాట్లాడుతూ రైతు భరోసా పథకంలో పెండింగ్ లో ఉన్న గత యాసంగ ప్రస్తుత వానకాలం నిధులను వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి. గత యాసంగి ప్రస్తుత వానకాలం సన్న ధాన్యం బోనస్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి. వ్యవసాయ రంగంలో విద్యుత్ ప్రైవేటీకరణకు దారితీసే రైతు డిస్కంను వెంటనే వెనక్కి తీసుకోవాలి పొటాష్ భాస్వరం కాంప్లెక్స్ ఎరువుల పెరిగిన ధరలను తగ్గించి రైతులకు అందుబాటులో ఉంచాలి యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని రద్దు చేసి రైతులకు సులభంగా ఎరువులు అందే విధంగా చర్యలు తీసుకోవాలి రిజర్వ్ బ్యాంక్ నిబంధనల ప్రకారం బ్యాంకులు తమ డిపాజిట్లలో కనీసం 18 శాతం వ్యవసాయ రంగానికి పంట రుణాలుగా అందించాలి .స్కే.జిల్లాలో రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు కొరత లేకుండా అందుబాటులో ఉంచాలి ఈ క్లాసుల్లో సిపిఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండి జబ్బార్ డి బాల్ రెడ్డి మాండ్ల రాజు మండల నాయకులు జి బాలయ్య భాస్కర్ దేవన్న పెద్ద కాజా సాయి లీల రేణుక శాంతమ్మ లలితమ్మ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఏటీఎం కేంద్రంలో అగ్నిప్రమాదం



**టి మీడియా, జూన్ 29, హైదరాబాద్ బ్యూరో:**
హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి పరిధిలో సోమవారం తెల్లవారుజామున ఒక ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. వాడేపల్లి ఎన్‌క్లేవ్‌లో ఉన్న ఒక ఏటీఎం కేంద్రంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చీకటిగా ఉన్న సమయంలో ఏటీఎం నుండి మంటలు, దట్టమైన పొగలు రావడంతో సమీపంలోని నివాసితులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. స్పందించిన స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది ఏటీఎం కేంద్రంలో మంటలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే పోలీసులకు, అగ్నిమాపక నియంత్రణ కేంద్రానికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఫైర్ ఇంజన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏటీఎంలో ఎగసిపడుతున్న మంటలను కేవలం కొద్ది నిమిషాల్లోనే అదుపులోకి తెచ్చి, ప్రమాదం పక్కన ఉన్న నివాసాలకు వ్యాపించకుండా అడ్డుకున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా పరిశీలించిన అగ్నిమాపక సిబ్బంది పేర్కొన్నారు. కాగా, ఈ అగ్నిప్రమాదం వల్ల ఏటీఎం మిషన్ ఏ మేరకు దెబ్బతిన్నది, లోపల ఉన్న నగదు సురక్షితంగా ఉందా లేదా అనే నష్టాన్ని పూర్తిగా అంచనా వేయడానికి పోలీసులు సంబంధిత బ్యాంకు అధికారులకు సమాచారం అందించారు. బ్యాంకు అధికారులు వచ్చిన తర్వాతే ఆర్థిక నష్టంపై పూర్తి స్పష్టత రానుంది. ప్రస్తుతం పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు జరుపుతున్నారు.

## బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**టీ మీడియా, జూన్ 30, పెబ్బేరు:**
వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణం సమీప బైపాస్ రోడ్డు దగ్గర మంత్రాలయం నుండి వనపర్తి వెళ్తున్న వనపర్తి డిపో బస్ అదుపుతప్పి పెబ్బేరు బైపాస్ రోడ్డులో బోల్తా పడిన సంఘటన లో ప్రమాద బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆసుపత్రికి వెళ్లి ప్రమాద బాధితులను పరామర్శించి మెరుగైన వైద్యం అందివ్వాలని వైద్యులను సూచించారు ఇట్టి విషయం స్థానిక ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి కి సమాచారం అందించి తీవ్ర గాయాలు అయిన వారిని వనపర్తికి తరలించా లని వనపర్తి ఏరియా హాస్పిటల్ డాక్టర్ లకు సూచన చేయాలనీ కోరారుఅనంతరం సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాద పరిస్థితిని పరిశీలించారు
ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయ్ వర్ధన్ రెడ్డి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యాపర్ల రాంరెడ్డి చిన్న గుమ్మడం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లెల చిన్నారెడ్డి పై పాట ఆవిష్కరణ




**టీ మీడియా, జూన్ 29, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మచ్చలేని నాయకుడిగా, వనపర్తి అభివృద్ధి ప్రదాతగా, ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పై రూపొందించిన వనపర్తి పొత్తిళ్లలో వేవిండో అడుగిలా ఆకుపచ్చ భూమిగా మార్చినులే వెలుగులా మా గడపలల్లో తొడిగిన తోరణమైనావుగా ఊరువాడకొచ్చిన పున్నమి వెలుగోలే ప్రత్యేక గీతాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. కోఆర్డినేటర్ గట్టు రాజు, చరణ్ రాజ్ దర్శకత్వంలో కళాకారుడు చంద్రశేఖర్ ఆజాద్ ఈ పాటను రూపొందించారు. కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, సీనియర్ నాయకులు ఎంట్ల రవి, లోకేష్ అభిమానులు పాల్గొన్నారు.

# స్కూల్‌లో ఉర్దూ వివాదం

- ప్రిన్సిపాల్‌పై బీజేపీ నేతల దాడి



**టి మీడియా, జూన్ 29, ఆర్మూర్ :**
నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పరిధిలోని పెర్కిట్ గ్రామంలో ఉన్న భరత్ చంద్ర హైస్కూల్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. హిందీ క్లాసులో విద్యార్థులకు ఉర్దూ బోధిస్తున్నారనే ఆరోపణలపై పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయురాలిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదే సమయంలో, పాఠశాల క్యాంపస్‌లోకి అక్రమంగా చొరబడి ప్రిన్సిపాల్‌పై భౌతిక దాడికి పాల్పడినందుకు గాను బీజేపీ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు కౌంటర్ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. పాఠశాలలో ఇటీవల 1 నుండి 5 తరగతుల విద్యార్థులకు హిందీ బోధించేందుకు హుమా హానియా అనే ఉపాధ్యాయురాలిని నియమించారు. అయితే, ఆమె హిందీ సిలబస్‌ను పక్కనబెట్టి విద్యార్థులకు ఉర్దూ అక్షరమాలను నేర్పుతున్నట్లు ఆరోపణలు వచ్చాయి. దీనితో పాటు, క్లాసులో విద్యార్థులు ఒకరినొకరు 'నమస్తే' అని కాకుండా 'ఆదాబ్' అంటూ పలకరించుకోవాలని సదరు టీచర్ ఒత్తిడి తెచ్చినట్లు విద్యార్థుల ద్వారా ఫిర్యాదులు అందాయి. ఈ వ్యవహారంపై తల్లిదండ్రులు గతంలోనే నిరసన వ్యక్తం చేయగా, గొడవ పెద్దది కాకుండా ఉండేందుకు స్కూల్ ప్రిన్సిపాల్ అమీర్ ఖాన్, కరస్పాండెంట్ మల్లయ్యలు విద్యార్థుల నోట్‌బుక్స్‌లో ఉర్దూ రాసి ఉన్న పేజీలను చింపేసినట్లు విచారణలో తేలింది.

**బీఎన్ఎస్ యాక్ట్ కింద కేసులు**
ఈ వ్యవహారంపై నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండలాధికారులు, ఆర్మూర్ ఇన్‌స్పెక్టర్ పి. సత్యనారాయణ పాఠశాలను సందర్శించి ప్రాథమిక విచారణ జరిపారు. ఆరోపణలు నిజమేనని తేలడంతో, ఆర్మూర్ తహసీల్దార్ ఇచ్చిన అధికారిక ఫిర్యాదు మేరకు వివిధ వర్గాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యవహరించినందుకు గాను టీచర్ హుమా హానియా, ప్రిన్సిపాల్ అమీర్ ఖాన్, కరస్పాండెంట్ మల్లయ్యలపై బీఎన్ఎస్ యాక్ట్ కింద పోలీసులు కేసులు నమోదు చేశారు.

**ప్రిన్సిపాల్‌పై బీజేపీ శ్రేణుల దాడి**
ఇదిలా ఉండగా, ఆర్మూర్ టౌన్ బీజేపీ అధ్యక్షుడు మందుల బాలు తన అనుచరులు, పార్టీ కార్యకర్తలతో కలిసి పాఠశాల క్యాంపస్‌లోకి దూసుకెళ్లారు. అనుమతి లేకుండా చిన్న పిల్లలకు ఉర్దూ నేర్పించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ, అక్కడే ఉన్న పోలీసుల సమక్షంలోనే స్కూల్ ప్రిన్సిపాల్ అమీర్ ఖాన్‌పై బీజేపీ శ్రేణులు మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. ఈ ఘటనపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య స్పందిస్తూ.. అక్రమంగా చొరబడటం, ప్రిన్సిపాల్‌పై దాడి చేసినందుకు గాను బీజేపీ నేతలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ రెండు కేసుల్లో ప్రస్తుతానికి ఎవరినీ అరెస్ట్ చేయలేదని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు స్పష్టం చేశారు.

## మహాలక్ష్మి పథకం ఎఫెక్ట్....

- రూ.1,059 కోట్ల లాభాల్లో టీజీఎస్ఆర్టీసీ



**టి మీడియా, జూన్ 29, హైదరాబాద్ బ్యూరో :**
పదేళ్ల నష్టాల నుంచి బయటపడి టీజీఎస్ఆర్టీసీ రికార్డు స్థాయి లాభాలను నమోదు చేసింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ ఏకంగా రూ.1,059.2 కోట్ల లాభాలను సాధించి సంచలనం సృష్టించింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ఈ విజయానికి ప్రధాన పునాదిగా నిలిచింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. గతంలో 67 శాతంగా ఉన్న బస్సు ఆక్యుపెన్సీ రేటు ఇప్పుడు 98 శాతానికి చేరుకుంది. నిరంతర నష్టాలతో ఇబ్బంది పడిన ఆర్టీసీ, ఇప్పుడు లాభాల బాట పట్టడం ప్రయాణికులకు సంతోషాన్ని కలిగిస్తోంది. సమర్థవంతమైన నిర్వహణ, ప్రభుత్వ మద్దతు, క్రమబద్ధమైన ఆర్థిక క్రమశిక్షణతో సంస్థ ఈ ఘనత సాధించింది. టీజీఎస్ఆర్టీసీ ఈ స్థాయి లాభాలను ఆర్జించడం రవాణా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోయింది.

**మహాలక్ష్మి పథకంతో పెరిగిన ఆదరణ**
మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం టీజీఎస్ఆర్టీసీ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేసింది. బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య భారీగా పెరగడం సంస్థకు ఆర్థికంగా ఎంతో ఊతమిచ్చింది. ప్రయాణికుల సంఖ్య పెరగడంతో పాటు, అదనపు ఆదాయం కోసం సంస్థ తీసుకున్న చర్యలు కూడా ఫలితాలను ఇచ్చాయి. టోల్ ఛార్జీలు, సేఫ్టీ సెస్, రౌండ్-అప్ ఛార్జీలలో చేసిన వ్యూహాత్మక మార్పులు రాబడిని పెంచడంలో సహాయపడ్డాయి. ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు అందడం కూడా సంస్థ కోలుకోవడానికి దోహదపడింది. గతంలో కేవలం ప్రభుత్వ సహాయంపై ఆధారపడిన ఆర్టీసీ, ఇప్పుడు స్వయం సమృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. రానున్న కాలంలో మరిన్ని ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రయాణికులను మరింత ఆకట్టుకునేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

**రాబోయే ఆర్థిక సంవత్సరంలో భారీ లక్ష్యాలు**
ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో కూడా టీజీఎస్ఆర్టీసీ తన లాభాల జోరును కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ ఏడాది రూ.9,639.5 కోట్ల ఆదాయం సాధించాలని, రూ.1,118.8 కోట్ల లాభాలను అందుకోవాలని సంస్థ ప్రణాళికలు రూపొందించింది. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత 2014-15లో కేవలం రూ.3,294 కోట్లుగా ఉన్న ఆదాయం, ఇప్పుడు రూ.9,374.18 కోట్లకు చేరుకోవడం సంస్థ సాధించిన అద్భుత ప్రగతికి నిదర్శనం. భవిష్యత్తులో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మరిన్ని బస్సులను నడపాలని, సేవల నాణ్యతను మరింత పెంచాలని యాజమాన్యం నిర్ణయించింది. ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన రవాణా సౌకర్యాలు అందించడమే ధ్యేయంగా ముందుకు సాగుతోంది. ఆర్థికంగా బలోపేతం అవుతున్న ఆర్టీసీ, సామాన్యులకు మరింత చేరువయ్యేలా తన సేవలను విస్తరించనుంది. ఈ విజయ ప్రస్థానం తెలంగాణ రవాణా వ్యవస్థలో కొత్త శకానికి నాంది పలుకుతోంది.

## సాయిచంద్‌కి నివాళులు



**టీ మీడియా, జూన్ 29, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర మాజీ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ కి ఘన నివాళులు అర్పించిన బీఆర్ఎస్ యువజన నాయకులు వజ్రాల రమేష్. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన పాటల ద్వారా తెలంగాణ ఉద్యమంలో ప్రజలను జాగృతం చేసిన ఆయన, అశేష కళాకారుల గుండెల్లో, ప్రజల మదిలో ఎప్పటికీ చిరస్మరణీయుడిగా నిలుస్తారు అన్నారు. ఈ కార్యక్రమంలో రాములు నాయక్, సాలమ్మ నాయక్, పున్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

## బోరుకు మరమ్మతులు చేయించిన కౌన్సిలర్



**టీ మీడియా , జూన్ 29, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా కేంద్రంలోని 22వ వార్డు శ్వేతా నగర్ మర్రిచెట్టు ఆంజనేయ స్వామి గుడి దగ్గర నిరుపయోగంగా ఉన్న బోరుకి బోరు మోటర్ బిగించి కాలనీలోని ప్రజలకు ఇంటింటికి బోరు నీరు చేరే విధంగా పైప్ లైన్ ఏర్పాటు చేయించిన 22 వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ మెకానిక్ శ్రీను. కాలనీ వాసులకు శాశ్వతంగా మంచినీటి సమస్యను తీర్చినందుకు కాలనీవాసులు బోర్ కి టెంకాయ కొట్టి, పూజ చేసి 22 వ వార్డు కౌన్సిలర్ ఏర్వ అరుణ మెకానిక్ శ్రీనుకు ధన్యవాదములు తెలిపారు.

## పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పణ



**టీ మీడియా, జూన్ 29 ,ఆత్మకూరు:** వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో పెద్దమ్మ తల్లి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఆత్మకు పట్టణ మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. ఉదయం ఆరు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు బోనాల ఎత్తి నైవేద్యం పెద్దమ్మ తల్లికి సమర్పించారు. ప్రతి ఇంటిని గుమ్మడికాయ పెద్దమ్మ తల్లికి సమర్పించి, ఘనంగా పూజలు నిర్వహించారు. పట్టణ ప్రజలు పెద్దలు దాతలు భార్యగా విరాళాలు ఇచ్చి, ఈ కార్యక్రమం అంగరంగ వైభవంగా జరగడానికి సహాయం చేశారు. పట్టణంలోని ప్రతి బొడ్రాయి దగ్గర ఘనంగా పూజలు నిర్వహించారు. ప్రతి బొడ్రాయి దగ్గర ముదిరాజ్ ఒకటి సంఘం వారు అలంకరణలు చేసి, ఫోటోలు దగ్గర లేకపోతే ఊరేగింపు చేశారు. బైనివారు ఊరేగింపులో ప్రతి ఇంటి నుండి అమ్మవారికి జొన్నలు బియ్యం సేకరించి దాంతో అమ్మవారికి మహా బోనం నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఏడు గంటల తర్వాత భూతాపిల్లి పోతురాజు బొడ్రాళ్ళు దగ్గర పూజలు చేశారు. పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో గ్రామంలో వ్యాధులు తిరిగి ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని గ్రామస్తులు మొక్కుకున్నారు. ఈ గస్తీలో ఎస్సై జయన్నతో పాటు పాటు సిఐ శివకుమార్ పాల్గొన్నారు. ఈ పెద్దమ్మ తల్లి మహోత్సవాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు మొగిలి శ్రీధర్ గౌడ్, టిఆర్ఎస్ నాయకులు రవికుమార్, ప్రముఖ వ్యాపారవేత్త గాడి లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ నల్లగొండ శీను, జిందే శీను అక్షర నాగేశ్వర్, మనివర్ధన్ రెడ్డి, రవికాంత్ ,శివానంద్, టి జె విశ్వేశ్వర్ ,రామకృష్ణ కొండాపురం రాము ,రఘు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు

# నకిలీ విత్తనాల ముఠా ఆగడాలు

చూస్తే లక్ష్య సాధనపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.
చట్టపరమైన చర్యలు సరిపోతున్నాయా?
2025లో 127 మంది అరెస్టు చేయగా, 2026లో ఇప్పటివరకు 39 మంది మాత్రమే అరెస్టయ్యారు. క్రిమినల్ కేసులు నమోదవుతున్నా, నకిలీ విత్తనాల వ్యాపారం మాత్రం ఆగడం లేదు. లైసెన్సుల రద్దు, బ్లాక్‌లిస్టింగ్ వంటి చర్యలు కూడా పరిమితంగానే కొనసాగుతున్నాయి.
నాణ్యత తనిఖీల్లో లోపాలు
విత్తనాల నాణ్యత పరీక్షల్లోనూ లోపాలు కనిపిస్తున్నాయి. వేల సంఖ్యలో నమూనాలు సేకరిస్తున్నప్పటికీ, పరీక్షల ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. దీంతో నకిలీ విత్తనాలు రైతుల చేతికి చేరిన తర్వాతే అసలు విషయం బయటపడుతోంది. అప్పటికే రైతు పెట్టుబడి, పంట రెండూ నష్టపోతున్నాయి.
నకిలీ విత్తనాల కారణంగా...
మొలక శాతం తగ్గుతోంది. దిగుబడి గణనీయంగా పడిపోతోంది. మళ్లీ విత్తనం కొనాల్సి వస్తోంది. అప్పుల భారం పెరుగుతోంది. చివరికి నష్టపోయేది రైతే.
పోలీసు కేసులతో నకిలీ విత్తనాల సమస్యను కేవలం పోలీసు కేసులతో పరిష్కరించడం సాధ్యం కాదు. విత్తనాల ఉత్పత్తి నుంచి రైతు చేతికి చేరే వరకు ప్రతి దశలో కఠినమైన పర్యవేక్షణ అవసరం. గ్రామ స్థాయిలో తనిఖీలు పెంచడంతో పాటు, నకిలీ విత్తనాల తయారీదారులు, పంపిణీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం అందించాలి. రైతు రక్షణే ఆహార భద్రతకు పునాది అనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించి సమగ్ర కార్యాచరణ చేపట్టాల్సిన అవసరం ఉంది.



# నిజాయితీ, నిబద్ధతతో ప్రజలకు సేవ చేయాలి

- డీఎస్పీలతో డీజీపీ సీవీ ఆనంద్

**టీ మీడియా జూన్ 29,హైదరాబాద్ బ్యూరో**
తెలంగాణ పోలీసు శాఖలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) హోదా నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా పదోన్నతి పొందిన 36 మంది అధికారులకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, యూనిట్లలో పోస్టింగ్‌లు కల్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీవీ ఆనంద్, డీజీ (లా అండ్ ఆర్డర్) మహేష్ భగవత్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నూతనంగా పదోన్నతి పొందిన అధికారులను అభినందించారు. డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాదని, అంతకుమించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించే అవకాశం అని పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ తమపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టేలా ప్రతి అధికారి నిజాయితీ, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే గుర్తించి, చట్టబద్ధంగా, పారదర్శకంగా పరిష్కరించే దిశగా పనిచేయాలని, ప్రజలకు చేరువయ్యే అధికారులుగా మంచి పేరు తెచ్చుకోవాలని డీజీపీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలతో సత్సంబంధాల పెంపు, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం వంటి అంశాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన కోరారు. డీఎస్పీ హోదాలో ప్రతి నిర్ణయం ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసేలా ఉండాలని, ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రదర్శించాలని ఆయన తెలిపారు. ప్రజల భద్రత, సంక్షేమమే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అంకితభావంతో పనిచేస్తేనే వృత్తిపరంగా మరింత ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కాగా సీఐల నుండి డీఎస్పీలుగా పదోన్నతి పొందిన వీరికి లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోస్టింగ్స్ కాకుండా ఇతర విభాగాల్లో తమ సేవలను నిర్వహించనున్నారు